# అస్తిత్వానికి అటూ యిటూ...

తన ముందున్న గుంపును రెండు చేతుల్తోనూ పక్కకు తొలగించు కుంటూ కంపార్టుమెంటు గేటు ముందుకెళ్ళి "సంజీవీ!.... సంజీవీ!" అంటూ మరోసారి అరిచాడు జానీ.

"జానీ... యిక్కడ... నేనిక్కడ..." అన్న సమాధానం వినవచ్చింది. గేటులోంచీ కిందికి దిగిన లావుపాటి ఆకారం వెనకనుంచీ వో చేత్తో సూట్‌కేసూ, మరోచేత్తో జిప్‌బాగూ పట్టుకుని, సన్నగా, రివటలావున్న శరీరం ప్లాట్ ఫాం పైకి దూకింది.

"యేదీ ఆ బాగ్ నాకియ్యి" అంటూ బలవంతంగా మిత్రుడి చేతిలోని బరువును అందుకోబోయాడు జానీ.

"అదివద్దు... యీ సూట్‌కేసు తీసుకో" అని కంగారుగా అరిచాడు సంజీవి జిప్‌బాగ్‌ను గుండెలకి హత్తుకుంటూ.

"ప్రయాణాలు చేసేటప్పుడు డబ్బును అండర్ పాకెట్‌లో దాచుకోమని యెన్నిసార్లు చెప్పినాను నీకు! యీ రష్‌లో యెవరైనా జిప్‌బాగ్‌ను వుడాయించుకొని పోతే యేం చేస్తావ్?" అంటూ దాన్ని లాక్కోబోయాడు జానీ.

"వద్దొద్దు..." అని ప్రాణమంతా వుగ్గపట్టుకుని అరిచాడు సంజీవి. జానీ విస్తుపోయి చూస్తూవుండగా "డబ్బు పాకెట్లోనే వుంది, నువ్వీ సూట్‌కేసే తీసుకోముందు..." అన్నాడతను తమాయించుకోడానికి ప్రయత్నిస్తూ.

నలుపురంగు మఫ్లరూ, స్వెట్టర్లతో చీకట్లో కలిసిపోతున్న మిత్రుడి

ఆకారంకేసి చికిలిచూపుల్ని సారించి, దేనికోసమో వెదుకుతున్నట్టు పైకీ కిందికీ కలయజూశాడు జానీ. అంతలో తేరుకుని, మెల్లగా నవ్వేస్తూ "యీ అర్ధరాత్రి ప్రయాణాలు అలవాటు లేక యెక్కడోపడి నిద్రపోయినావనుకుంటిని. బోగీలోకెక్కి, సీటు కనిపెట్టి, బయటికి మోసుకోని రావల్సిందేనేమో ననిపించింది..." అన్నాడు.

ప్లాట్‌ఫాంపైన నడుస్తున్న జనాలకు దారివ్వడంకోసం దూరంగా వచ్చినిల్చున్నాక "నిద్రనేది పోతేగదామేల్కోనేదానికి! బెర్తులు వాల్చుకున్నామనే మాటేగాని పాసింజెర్లు నిద్రే పోలేదు. పన్నెండు గంటలనుంచీ అలహాబాదొచ్చేసిందోచ్చేసిందని ఆపసోపాలు పడతానే వున్నారు." అన్నాడు సంజీవి.

"సరే, అయితే త్వరగా బయటపడ్దాంపద! యిప్పుడు గంట మూడు కావస్తా వుంది. రూం చేరుకుంటే గంటయినా కునుకు తీయచ్చు" అంటూ అతగాణ్ణి ముందుకు లాగాడు జానీ.

స్నేహితుని చేతిని పక్కకు తొలగిస్తూ "వుండుండు, మనమిప్పుడు మీ రూంకు పోవడంలేదు. నాకోసం మనిషిని స్టేషనుకే అంపిస్తానన్నాడాయన" అన్నాడు సంజీవి. 'యెవరు? యెవరిని?' అన్న ప్రశ్నలు జానీ పెదవుల మధ్యనుంచీ దొర్లకమునుపే వెనక్కు తిరిగి, "ఆ పక్కన యెవురో అరస్తా వుండారు చూడు" అన్నాడతను. జానీ వెనుదిరిగి చూశాడు.

వొకటి రెండు నిమిషాల తర్వాత "లక్ష్మీనారాయణశాస్త్రి" అన్న మాట వినిపించింది. మరో రెండునిమిషాల తర్వాత బిగ్గరగా అదేమాట వినవచ్చింది. యింకో రెండునిమిషాల తర్వాత ఆ మాటను ప్రసారంచేస్తున్న వ్యక్తి సైతం వాళ్లముందుకు వచ్చేశాడు.

దాదాపు ఆరడుగుల పొడవున్న బలిష్టమైన ఆ వ్యక్తి వయస్సు చీకటిలో స్పష్టంగా గోచరించడంలేదు. పొడవాటి లాల్చీకింద గోచీపోసి కట్టుకున్నపంచె, బాగా పొట్టిగా కత్తిరించుకున్న తలవెంట్రుకలమధ్య పొడవాటి పిలక. చేతిలో గొడుగు. పహిల్వాన్‌లాగా కనిపిస్తున్న ఆ వ్యక్తి ముందుకు గెంతుతూ "నేనే, నేనేనండీ లక్ష్మీనారాయణ శాస్త్రిగారి గెస్టును" అన్నాడు సంజీవి.

అతను తన నడక వేగాన్నయినా తగ్గించకుండా, గొడుగును ముందుకు చాపుతూ, "దేఖియే! వుస్ బంబాకే పాస్ ఖడే హోజాయియే! సబ్‌లోగ్ వహీ యింతెజార్ కర్ రహేహై!" అంటూ ముందుకు కదిలిపోయాడు.

జానీ ముఖం ముడుచుకుని సంజీవి వెంటనడస్తూ "యీ

లక్ష్మీనారాయణశాస్త్రి యెవురు?" అని అడిగాడు.

"మా కొలిగ్‌కు తెలిసిన మనిషి. యిక్కడే అలహాబాదులో వుంటాడు. నేనొస్తావున్నట్టుగా ముందుగా జాబు రాసినాను. ఆయన నేరుగా ఫోన్ చేసినాడు. వాళ్ల యింటికే వచ్చేయమన్నాడు. పన్లన్నీ ఆయనే దగ్గిరుండి జరిపిస్తానన్నాడు." అన్నాడు సంజీవి.

జట్లుజట్లుగా నిలబడ్డ జనాల్ని దాటుకుంటూ వో గుంపు దగ్గరికొచ్చాక "లక్ష్మీనారాయణశాస్త్రీ... లక్ష్మీనారాయణశాస్త్రీ..." అంటూ తన కోడ్‌సందేశాన్ని వినిపించాడు సంజీవి. వాళ్లు పట్టించుకోకుండా అతడికి అర్థంగాని వేరే భాషలో మాట్లాడుకోసాగారు. "ఆ పెద్దమనిషి చెప్పిన తావు యిది గాదేమో!" అని గొణుక్కుంటూ మరో గుంపు దగ్గరికి వెళ్ళి, మరోసారి తన కోడ్‌ను పలికాడతను. "మేమూ అక్కడికే! లక్ష్మీనారాయణశాస్త్రి... అక్కడికే! అక్కడికే!" అంటూ కొన్ని గొంతుకలు వంత పలికాయి. మరికొంచెం పక్కకు జరిగి ఆ గుంపులో కలిసిపోయే ప్రయత్నంచేశాడు సంజీవి. తానూవచ్చి అతడిపక్కన నిల్చుంటూ వాళ్లందరినీ పరీక్షించి చూడసాగాడు జానీ. మూటలూ, మనుషులూ, చీకటీ, మసక వెలుతురూ కలగలిసిన ఆ సమూహంలో యెవరెవరు యేమిటో తెలుసుకోవడానికి విశ్వప్రయత్నం చేయసాగాడు. యీలోగా గొడుగు పట్టుకున్న హిందీమనిషి ఆ గుంపుముందే పెద్దపెద్ద అంగలు సారిస్తూ మరో వైపుకు దూసుకెళ్ళాడు. గుంపు గుంపంతా వొకే గొంతులా "యిక్కడ... యిక్కడ... మేమిక్కడ" అంటూ హోరెత్తింది. అతనూ అదే జోరుతో "వహీ రహీయే!" అని అరుస్తూ వెళ్లిపోయాడు. యీలోగా మరికొన్ని నీడలు ఆ గుంపులో కలిశాయి.

"యింతమంది అతిథులూ వొక యింటికేనా?" అంటూ ఆశ్చర్యపోయాడు జానీ.

యీలోగా సమూహంలోని వ్యక్తులు కొందరు పరస్పర పరిచయాలు మొదలు పెట్టారు. తిరుపతి, గుంటూరు, వరంగల్లు, కాకినాడ, ఆదోని, అనంతపురం - వివిధ ప్రాంతాలకు చెందిన వూరి పేర్లు వినబడుతున్నాయి.

మరికాసేపటి తరువాత గొడుగు పహిల్వాన్ తిరిగొచ్చాడు. "సబ్ టేషన్‌కే బాహర్ చలియే! వహాఁసే ఆటోమే జానా హై" అంటూ ఫర్మానా దాఖలుచేశాడు. అతడి వెనకే గుంపంతా కదిలింది. సంజీవితో బాటూ జానీగూడా నడవసాగాడు.

యెక్కువమంది ప్రయాణికుల్ని అలహాబాదులోనే విడిచేసిన వారణాసి యెక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం పక్కన యింకా నసుగుసులు పడుతోంది. పక్కనే చాయ్‌వాలాలు సుప్రభాతం పలుకుతున్నారు. వోవర్ బ్రిడ్జి పైనుంచీ చూస్తున్న

జానీకి, తెలుపూ యెరుపూ, ఆకుపచ్చ దీపాలతో జోగుతున్న రైల్వేస్టేషను, పగటి వేషగాడి చమ్కీదుస్తుల్లా వెలవెలబోతూ కనిపిస్తోంది. తెలుగుభాష అనే మాధ్యమాన్ని వూతగా పట్టుకుంటూ లక్ష్మీనారాయణ శాస్త్రిగారి అతిథులందరూ స్టేషను బయటకు తరిలి వచ్చేశారు.

మంచులో తడిసిన చిత్తడి నేలపైన పెద్ద పెద్ద ఆటోలూ, గుర్రపుబండ్లూ అడ్డదిడ్డంగా వేచివున్నాయి. గొడుగు పహిల్వాను అస్పష్టమైన గొంతుకతో ప్రయాణీకులకేవో సలహాలు చెబుతున్నాడు. జట్లుజట్లుగా వాళ్లు పెద్దసైజు ఆటోల్లోకి బదిలీ అవుతున్నారు.

ఆటో చిన్నసైజు వానులాగుంది. మూడువరసల సీట్లు. సీటుకారుగురు మనుషులు. వాహనమంతా స్ప్రింగుల సంచయంలా వూగుతుండగా, బడబడమని శబ్దం చేస్తూ ఆటో బయల్దేరింది. "విక్రమ్ అంటార్లే యీ ఆటోను యీ వూళ్ళో!" అంటూ సంజీవికి దాన్ని పరిచయం చేశాడు జానీ.

నిద్రపోతున్నరోడ్ల వెంట విక్రమ్ పరుగులు తీయసాగింది. ముందుగా వెళ్తున్న ఆటోల తాలూకు యెర్రటిలైట్లు మంచు తెరలమధ్య మినుకు మినుకుమంటున్నాయి. రోడ్లకిరువైపులా ముసుగులు కప్పుకున్న వ్యక్తుల్లా యిండ్లుగూడా నిద్రలో కునుకుతున్నాయి. విశాలమైన వీధుల్ని దాటి, సన్నటి సందుల్లోకి దూరింది విక్రమ్. నేలపైన యిటుకలు పరిచిన సన్నటి గొందులు... రెండువైపులా పెచ్చులూడిన పాతకాలపు యిండ్లు... బాగా పల్లంగా కనిపిస్తున్న దారి... వీధిదీపాలు వెలగడంలేదు. యెక్కడికి వెళ్తున్నామో అంతుబట్టని అగమ్యగోచరమైన దారి... చివరకు యిద్దరువ్యక్తులు మాత్రం నడవడానికి వీలయ్యే సన్నటి గొందిముందు వరసగా విక్రమ్‌లు ఆగిపోయాయి. అంతటితో తమ పని అయిపోయినట్టుగా విక్రమ్ డ్రైవర్లు దిగి వెళ్లిపోయారు.

"యెక్కడికి పోతావుండాం మనం? యిక్కడేం పని మనకు?" అంటూ ప్రశ్నించాడు జానీ ఆందోళనతో నిండిన గొంతుకతో. అతడిమాటల్ని పట్టించుకోకుండా "మనమూ పోదాం రా" అంటూ తోటిప్రయాణీకుల్ని అనుసరించసాగాడు సంజీవి.

యేటవాలుగా, పెద్ద అగడ్తలోకి లాక్కెళ్తున్న సన్నటి వీధి. రెండువైపులా పాడుబడిన పాత యిండ్లు... యెక్కడా దీపాలు వెలగడంలేదు. అయిదు నిమిషాలలా నడచిన తర్వాత వో మలుపులో చిన్న గుడ్డి విద్యుద్దీపం కనపించింది. దానిముందు ప్రయాణీకుల సంరంభమూ వినిపించింది. ముందుగా గుడ్డిదీపం కింద, పాతకాలపు గారమిద్దెపైన, రంగులు వెలిసిపోయిన

చెక్కతలుపుల పక్కన, బాగా నొక్కులుపడిన రేకులపైన, వంకరటింకరగా, తప్పులతడకగా వున్న తెలుగు అక్షరాలు జానీ దృష్టిని ఆకర్షించాయి. "ప్రనామం హయిగ్రీవశాస్త్రుల ధర్మ సత్రము... క్షీరోద్రము లక్ష్మీనారాయణశాస్త్రులు, ఆంధ్రపండా... తీర్థ పురోహితులు"

పొట్టిగావున్న పాతకాలపు ద్వారంగుండా, సంజీవి వెంట యింటిలోపలికి అడుగుపెట్టాడు జానీ. అది చేయెత్తితే తగిలేటట్టున్న చిన్నగది. మూడువైపులా ద్వారాలున్నాయి. వో ద్వారంగుండా ముందుకెళ్ళారిద్దరూ. సన్నగా పొడవాటి సొరంగంలాంటి మార్గం. మరోగది. తర్వాత మరో సన్నటిదారి. మరో పాతబడిన గుమ్మందాటగానే పెద్దనడవా. మధ్యలో ఆకాశం కనిపిస్తోంది. దాదాపు యిరవై అడుగుల పొడవూ వెడల్పులతో పెద్దవసారా. చుట్టూ రకరకాల గదులు.. పెచ్చులూడిపోయిన వసారా గారనేలపైన రకరకాల చెత్తాచెదారం... మురికినీళ్ల వెల్లువలు... నడవా అరుగుపైన కూర్చున్న గొడుగు పహిల్వాను పెద్ద పెద్ద తాళాలగుత్తి చేతబట్టుకుని, చుట్టూమూగిన జనాల్ని గదమాయిస్తున్నాడు "మాకో గది... మాకూ వొక రూం... మారూమేదయ్యా?" అంటూ గొంతుకలు అతడిని ప్రాధేయపడుతున్నాయి.

జిప్‌బాగ్‌తో సహా గుంపులోకి జొరబడి, అతి ప్రయత్నంపైన అతగాడిని సమీపించాక "లక్ష్మీనారాయణశాస్త్రి గారెక్కడ?" అని అరిచాడు సంజీవి.

అతను సంజీవి వైపుకు తిరిగైనా చూడకుండా "వే సోరహేహై! కల్ మిలేంగే!" అన్నాడు.

"అయితే నాకు గూడా వొక రూం యియ్యండి. నాకు అన్ని సౌకర్యాలు అమిరిస్తానని శాస్త్రిగారే ఫోన్‌చేసి రమ్మన్నారు" అన్నాడు సంజీవి.

"తుమ్హారా నామ్?" అతనువాకబు చేశాడు.

"సంజీవి ఫ్రమ్ మదనపల్లె... చిత్తూరుజిల్లా. ఆంధ్రప్రదేశ్." అంటూ మళ్లీ గొంతు చించుకున్నాడు సంజీవి.

"క్యేం షోర్ మచారహేహై! యే తాళా లేలో! కమరా నెమ్మర్ బత్తీస్ మే జావో!" అని కసురుకుంటూ అతడి చేతికో తాళం అందించాడు గొడుగు పహిల్వాను.

తాళంచెవిని చేతబట్టుకుని తమ గదికోసం వెదకసాగారు స్నేహితులిద్దరూ. సొరంగాల్లాంటి దారుల్ని కలుపుతున్న నడవాల మధ్య, కావల్సినగదిని కనిపెట్టడమంత సులభసాధ్యంగా తోచడంలేదు. వాకబు చేసి తెలుసుకోడానికి యాత్రికులుగాని వ్యక్తులెవరూ యెదురుపడడం లేదు. చివరికో మూల

రూంనెంబరు ముప్పయిరెండును కనిపెట్టాడు జానీ. నామమాత్రంగా వేలాడుతున్న బీగం తెరిచి గది లోపలి కడుగుపెట్టారు యిద్దరూ. విరిగిపోయిన స్విచ్‌బోర్డును చీకట్లో వెదికిపెట్టి, స్విచ్‌నొక్కేసరికి జానీ తలప్రాణం తోకకొచ్చింది. గుడ్డిదీపం వెలిగింది. అలమారాలూ, మంచాలూ లేని నిరలంకారమైన గది. వోమూల చెదలుపట్టిన ద్వారం. అవతల బాత్రూం వుండొచ్చు. తలుపును వోరవాకిలిగా వేశాక జిప్‌బాగ్‌లోంచీ పాతశాలువాను పైకిలాగాడు సంజీవి. దానితోనే నేలపైని చెత్తను వో మూలకు చిమ్మి, ఆ తరువాత దాన్ని నేలపైన పరిచేశాడు.

శాలువాపైన చేరగిలబడుతూ "యిదేనా నీకోసరం ఆయనగారు యేర్పాటుచేసిన అతిథిసత్కారం?" అంటూ చిరునవ్వు నవ్వాడు జానీ.

తాను గూడా నడుం చేరేస్తూ "అలహాబాదుకు అస్తికల నిమజ్జనం కోసరం పోవాలని చెప్పినప్పుడు మాకొలీగ్ వొకాయన యీ అడ్రసునాకిచ్చి జాబు రాయమన్నాడు. జాబుకు బదులుగా టెలిఫోన్ వచ్చింది. పగటిపూట అంత ఖర్చు భరించుకోని ఫోన్ చేసి రమ్మని పిలిచినాడు ఆయన. తీరా వచ్చినాక యిప్పుడు యింతవరకూ మన అతీగతీ పట్టించుకోలేదు" అన్నాడు సంజీవి.

"నువ్వు గమనించినావో లేదో! యిక్కడికొచ్చినోళ్లంతా నీమాదిరి అస్థినిమజ్జనానికొచ్చినోళ్లే! అందురికీ ఫోన్లూ, జాబులూ అందినాయి. చూడబోతే యిదే ఆయన వృత్తిగా వుండాది" అన్నాడు జానీ.

"అయితే మంచిదే! తెల్లారిపోతావుంది. యీ పొద్దు పౌర్ణమి. మధ్యానం పన్నెండు గంటల్లోపల నిమజ్జనం జరిపించాలని ఫోన్లో హెచ్చరించినాను..." కళ్లుమూసుకునే చెబుతున్నాడు సంజీవి.

"ఆర్నెల్లుకుముందు, నేను అలహాబాదుకొచ్చేదానికి ముందు, మీ యింటికొచ్చినప్పుడు బాగనే కనపించింది గదా మీ అమ్మ! యింతలోపల అంత ఖాయిలా యెట్ల పడింది?" చాలా సేపటినుంచీ అడగదలచుకుంటున్న ప్రశ్నను చివరకి సంధించాడు జానీ.

"ఆ పొద్దు తెల్లారి నేను ఆఫీసుకు బయల్దేరతావున్నప్పుడు గుండెల్లో నొప్పిగా వుందని చెప్పింది." సంజీవి గొంతుక బొంగురు పోసాగింది. పడుకున్నందువల్ల అతని కనుకొలుకుల్లోకొచ్చిన కన్నీటిబొట్లు రెండూ అలాగే అక్కడే నిలిచిపోయాయి. "ఆ మాదిరి అప్పుడప్పుడూ అనడం ఆమెకు అలవాటే! ఆ పొద్దుగూడా అంతేలే అనుకున్నాను. పన్నెండు గంటలప్పుడు పక్కింటి పిల్లోడు పరిగెత్తుకోనొచ్చి అమ్మ పడిపోయిందని చెప్పినాడు. గబగబా

యింటికిపోయి, వెమ్మట్నే ఆస్పత్రికి తీసుకోనిపోయినాను. యింటెన్సివ్ వార్డులో చేర్పించినారు. వారందినాలు కోమాలో వుండిపోయింది. అప్పటికే ముప్పయివేలు ఖర్చయింది. అర్జెంటుగా యాభైవేలు అడ్వాన్స్‌గా కడ్తే ఆపరేషన్ చేస్తామన్నారు. డబ్బుకోసరం వెతుకులాడతా వుండిపోయినాను, యింకో వారం దినాలు. యీ లోపల అంతా అయిపోయింది."

"టయానికి దుడ్డెందుకు కట్టలేదు? పోనీ తర్వాత డబ్బు అడ్వాన్సు కడ్తానని చెప్పి ఆపరేషనయినా చెయ్యించలేక పోయినావా? డాక్టర్లుగూడా డబ్బుకోసరమని పేషంటును నిర్లక్ష్యం చేస్తారా? వీళ్లేం మనుషులు?" కోపంతో ఆక్రోశించాడు జానీ.

సంజీవి బదులు పలకలేదు.

"పోనీ నాకైనా టెలిగ్రామిచ్చుంటే యేమి? నేనిక్కడైనా ప్రయత్నం చేసుందును గదా?"

"మన ప్రాప్తం తీరిపోయింది. మనుషుల ప్రయత్నాల్తోనే అన్నీ జరిగేటట్టుంటే యింక మనుషుల్ని పట్టలేం. కర్మ చేసేదే మన పని. ఫలితం మాత్రం మనచేతిలో లేదు." అన్నాడు సంజీవి.

"నీ వేదాంతాన్నీ, భక్తినీ గంగలో కలిపెయ్. యిట్లాంటప్పుడు అవేవీ నిన్ను కాపాడవు. నీకైనా, నాకైనా, ఆ డాక్టరుకైనా దుడ్డొక్కటే దిక్కు. నాకు టెలిగ్రామిస్తే నా అగసాట్లేవో నేను పడుందును." జానీ మండిపడ్డాడు.

"యెంతని అడగమంటావు?" సంజీవి మాత్రం నెమ్మదిగా చెప్పుకుపోతున్నాడు. "యిప్పటికే నీకియ్యాల్సిన అప్పు వడ్డీతో కలిసి పాపం మాదిరిగా పెరిగిపోయింది. యిచ్చేదానికి నీకు అభ్యంతరం లేకపోయినా, అడిగేందుకు నాకైనా నోరుండాలగదా?"

యిద్దరూ మౌనంగా వుండిపోయారు. కాస్సేపటి తర్వాత సంజీవి గురకపెట్టడం గమనించాడు జానీ. బయటినుంచీ మానవ సంరంభం స్పష్టంగా వినబడుతోంది. అతడి చేతిగడియారంలో సమయం అయిదుగంటల్ని దాటింది. యిక ఆ రోజుకు నిద్రపోయే అవకాశం తనకులేదని జానీ కర్థమయింది.

తలుపుతెరిచిన శబ్దం వినబడగానే తిరిగి చూశాడు జానీ. పావడపైన పొడవాటి జాకెట్టు తొడుక్కున్న పన్నెండు పదమ్మూడేళ్ల అమ్మాయి లోపలికొచ్చింది. "పొద్దయానికి మీకు టిఫెను తయారు చేయాలంటే ముందుగా ఆర్డరివ్వాలి" అంది.

"యేం టిఫను?" అని అడిగాడు జానీ.

"ప్లేటు యిడ్లీ పదిరూపాయలు, దోసె పదిహేను, వుప్మా పది, కాఫీ అయిదు. టీ నాలుగు. కావాలంటే రూంకు తీసుకొస్తాను, లేకపోతే అక్కడికైనా వచ్చి తినచ్చు..."

"యెక్కడికి?"

"యిక్కడే! ఆ తూర్పువైపు వసారా దగ్గరే మా గది."

కాసేపు ఆలోచించాక "యింత బాగా తెలుగు మాట్లాడతావుండావు. మీది యే వూరు?" అని ప్రశ్నించాడు జానీ.

"నా పేరు సత్యవతి, మావూరు తెనాలి..."

"యిక్కడి కెప్పుడొచ్చినావు?"

"మా అమ్మానాన్నా యీ వూరొచ్చి నాలుగేళ్లవతాంది. నేనేమో రెండేళ్లక్రితం వచ్చాను."

"యిక్కడే చదువుకుంటావుండావా?"

"లేదు. యిక్కడ సప్లయి చేయటానికి మనిషి కావల్సివచ్చి మావాళ్లు నన్ను రప్పించుకున్నారు. ఆర్డరు చెప్తారా?"

"లక్ష్మీనారాయణశాస్త్రి యెక్కడుంటారు?"

"యిక్కడే! మూడో అంతస్థులో వుంటారాయన. ప్రొద్దున ఆరింటికల్లా కచేరీకొస్తారు. ఆసరికి మీరు స్నానం చేసి రెడీగా వుంటే సంగమానికెళ్లొచ్చు. నిమజ్జనం చేసేవాళ్లు మాత్రం వుపవాసం వుండాలి. మిగిలినవాళ్లు టిఫెను తినచ్చు..."

"శాస్త్రిది యీవూరేనా?"

"ఆయనదిగూడా తెనాలే! ముందున్న ఆంధ్రాపండాకు పిల్లలు లేకపోతే వీరిని దత్తుకు తెచ్చుకున్నారట!..."

"యీయనకు బిడ్డలెందరు?"

"నలుగురు. యిద్దరమ్మాయిలు, యిద్దరబ్బాయిలు. ఆర్డరు చెప్పండి. వెళ్ళాలి..."

"చెప్తాన్లే వుండు! యీయన కొడుకులేంచేస్తారు?"

"కొడుకులూ, అల్లుళ్లూ, అందరూ యిక్కడే వున్నారు. అందరూ ఆయన లైన్లోనే పనిచేస్తున్నారు. క్షణం తీరికుండదాయనకు. ఆర్డరు చెప్పండి."

"రెండు ప్లేట్లు యిడ్లీ... రెండు కాఫీలు"

ఆ అమ్మాయి మరోమాటకు అవకాశమివ్వకుండా వెనుదిరిగి

వెళ్ళిపోయింది.

"సంజీవీ! పైకిలేచి స్నానంచెయ్యి! ఆరుగంటలకంతా నీ పని ఆరంభమవుతుందంట!" అంటూ స్నేహితుడ్ని లేపి కూచోబెట్టాడు జానీ.

"పొయ్యేది గంగ దగ్గరికే కదా! అడ్నే స్నానం జేస్తాను" అన్నాడు సంజీవి బద్ధకంగా.

"యిక్కడ టాప్‌లో వస్తావుండేదిగూడా ఆ నీళ్లే! ముందిక్కడ స్నానం జెయ్యి! ఆపైన అక్కడా జేద్దువుగానీ!" అంటూ అతడ్ని బాత్రూంలోకి నెట్టాడు జానీ.

"మరి నీ స్నానం?" అని అడిగాడు సంజీవి, స్నానంచేశాక బట్టలు మార్చుకుంటూ.

"యీ చన్నీళ్ళు పోసుకుంటే నాకు జరమొస్తింది. యీ పొద్దుకు స్నానం పోస్ట్‌పోన్..." అన్నాడు జానీ. అతడు ముఖం కడుక్కునే సరికి టిఫిన్ ప్లేట్లతో సత్యవతి గదిలోకొచ్చింది

"నేను వొకపొద్దుండాలని చెప్పినారు. నువ్వు తిను..." అన్నాడు సంజీవి.

"మీరు కాఫీ మాత్రం తాగొచ్చు" అంది సత్యవతి.

"చూసినావా! అదీ అమెండ్‌మెంటు. అందుకే యీవేవీ లెక్క పెట్టద్దన్నాను." అంటూ విసుక్కున్నాడు జానీ.

"ఆర్డరిచ్చాక, టిఫినుకంతా డబ్బులివ్వకుంటే వొప్పుకోరు. మొత్తం ముప్పయ్యీ యివ్వాలి మీరు!" అంది సత్యవతి.

"యిదేం రూలు! తినకుండా డబ్బులెందుకియ్యాలి? అంతగా అయితే, ఆ ప్లేటుగూడా యిట్లియ్యి. రెండూ నేనే తింటాను" అంటూ కోపగించుకున్నాడు జానీ.

టిఫెను ప్లేట్లు కింద పెట్టిన తరువాత "నిమజ్జనానికెళ్లే వాళ్లు దోవతీ, టవలూ మరిచిపోకుండా పట్టుకెళ్ళాలి!" అంది సత్యవతి వెనుదిరిగి వెళ్లిపోతూ.

టిఫిన్ తిన్న తర్వాత "ఆరయిపోయింది. పద కచేరికి. మీ లక్ష్మీనారాయణ శాస్త్రిని కలుద్దాం!" అన్నాడు జానీ.

జిప్‌బాగ్‌ను భుజానికి తగిలించుకుని సంజీవి బయల్దేరాడు.

గదికి తాళంవేసి వసారాలోకొచ్చిన తర్వాత, తలపైకెత్తి చూశాడు జానీ. రెండవ అంతస్థుగూడా కిందిభాగంలాగే నానా కంగాళీగా వుంది. మూడవ అంతస్థు మాత్రం మెరుస్తున్న రంగులతో, బయటికే కనిపిస్తున్న యేసీ మిషన్లతో జబర్దస్తీగా వెలుగుతోంది. "అదే మీ శాస్త్రి నివాసం!" అంటూ చూపెట్టాడు జానీ.

రెండు మూడు సొరంగాలు దాటిన తర్వాత కచేరీగది తారసపడింది.

రెండడుగుల యెత్తున్న సిమెంట్‌వేదికపైన, రాతబల్ల కవతల, తెల్లటి పరుపుపైన కూర్చుని వున్నాడొక వ్యక్తి. మూటలా వొదిగొదిగి కూచోవడంవల్ల అతడెంత పొడవున్నాడో తెలియడం లేదు. దూదికుచ్చులా తెల్లబడిపోయిన అతడి జుట్టు బయటికి కనిపించని శారీరక రుగ్మతని బయటపెడ్తోంది గానీ, అతడి వయెస్సెంతో తెలపడం లేదు. అతడి వెనక గోడకు వేలాడుతున్న ఫోటో యేటవాలుగా వుండటంచేత అందులోని చిత్రమెవరిదో తెలియరావడంలేదు. దస్తావేజు పుస్తకమొకటీ, బిల్లు పుస్తకమొకటీ ముందుంచుకుని అతనేదో రాసుకుపోతున్నాడు. చట్టూ గుమిగూడిన జనం వొకేసారిగా అతడితో మాట్లాడటంకోసం గింజుకులాడుతున్నారు.

"నిమజ్జనానికి రెండువందలా యాభై, వేణీదానానికి అయిదు వందలు, గోదానానికి వెయిన్నీనూటపదహార్లు. అవి మినిమమ్ రేట్లు. ఆపైన యెంత మనస్సుకు తృప్తో అంత యివ్వచ్చు. చనిపోయినవాళ్ల ఆత్మకు శాంతి జరగాలి. వాళ్ల పరలోకయాత్ర, నిర్విఘ్నంగా సాగాలి. అందుకు మీరెంతయినా చెల్లించవచ్చు..."

రాతబల్ల ముందున్న వ్యక్తి కీచు గొంతుక పదే పదే యిదే మాటల్ని వల్లిస్తోంది. ఫీజుచెల్లించినవాళ్లు రసీదు కాగితాలతో బాటూ వెలుపలికొచ్చి సంగమానికి ప్రయాణమౌతున్నారు.

యింతలో చివ్వున బిల్లుపుస్తకం మూసిపెడుతూ "మిమ్మల్ని కాస్సేపు అవతలకూచోమన్నానుగదా!" అంటూ కోపంగా అరిచాడతను. గుంపుగా అతడ్ని చుట్టుముట్టిన జనమంతా యెవరికివారు కంగారుపడపోతూ వెనక్కు తప్పుకున్నారు.

వొక వ్యక్తిమాత్రం జోడించినచేతుల్ని కిందికి దించకుండా "శాస్త్రిగారూ! జేబులోని సొమ్మునంతా యెవరో రైల్లో కాజేశారు. యిప్పుడు నా దగ్గర పైసాగూడా లేదు. నిమజ్జనం మీరే యేదోలా జరిపించాలి. యింటికి తిరిగి వెళ్తానే వడ్డీతోబాటూ టీయెమ్మో చేస్తాను" అంటూ ప్రాధేయపడసాగాడు.

"ఆలోచిద్దాం. ముందు అవతలికెళ్లండి. డబ్బులతోపాటూ నిల్చున్నవాళ్ళకు రశీదులివ్వనివ్వండి!" అని గింజుకున్నాడు శాస్త్రి.

"శాస్త్రులుగారూ! పుణ్యమంతా మీదే! యీ పని జరిపించండి" అతను పట్టిన పట్టు వదలలేదు.

"నా పుణ్యం సంగతి సరేలేవయ్యా! మరి మీ పెద్దలు పుణ్యలోకాలకెళ్లాలా

వద్దా? నా సంగతి సరేననుకో! అవతల మిగిలినవాళ్ల కివ్వవలసిన సొమ్ము సంగతేం జేస్తావు?..."

"యిదిగాకుండా యింకానా? అదెంత ఖర్చవుతుంది?"

"యెంతలేదన్నా యింకో రెండువందలు..."

"శాస్త్రిగారూ!" గుంపులోనుంచీ యెవరో అరిచారు.

"ఆ మిగిలినసొమ్ము మేముయేర్పాటుచేస్తాం. యింటికెళ్లాక పంపుతానం టున్నాడు గదా! మీరే సహాయం చేయకపోతే యీవూళ్ళో దిక్కింకెవరున్నారు వీరికి! మీవంతుగా రశీదు యిప్పించండి"

శాస్త్రివోసారి పెద్దగా నిట్టూర్చాడు. "యింటికెళ్తూనే డబ్బు పంపించు. లేకపోతే మీ వాళ్లకు పంచమహాపాతకాలు చుట్టుకుంటాయి. ఆపైన నీ యిష్టం" అంటూ హెచ్చరించాక వో తెల్లకాగితం ముక్కని అతడి చేతికిచ్చాడు.

సంజీవి యీసారి బలప్రదర్శనలో పాలుపంచుకుంటూ ముందుకుతోసుకు వెళ్ళాడు. "శాస్త్రిగారూ! నేను సంజీవిని. మాది మదనపల్లె! మీరు ఫోన్‌చేసి రమ్మన్నారు" అని పెద్దగా అరిచాడు.

శాస్త్రి అతడివైపుకు తిరిగైనా చూడకుండా, "చెప్పండి నిమజ్జనమా? వేణీ దానమా? గోదానం గూడా వుందా?" అంటూ రేట్లజాబితా చదివాడు. సంజీవి రెండువందలాయాభై యిచ్చి రశీదు తీసుకున్నాడు.

"పద పద... విక్రమ్‌లు యెదురు చూస్తావుంటాయి మనకోసరం" అన్నాడు జానీ.

యింటి బయటికొచ్చి కొద్దిదూరం నడచాక వోసారి వెనుదిరిగి చూశాడు జానీ. పాతబడిన గారమిద్దెలమిధ్య, కూలిపోవడానికి సిద్ధంగా వున్నట్టున్న రెండు కింది అంతస్థులపైన, అధునాతనంగా, దర్జాగా, డాబుగా తళతళలాడుతూ కనిపిస్తోంది శాస్త్రి నివాసం.

"చూడు! మీ శాస్త్రి అంగడి యెంత బాగా జరగుతావుందో" అన్నాడు జానీ. "నిజానికది స్వంత యిల్లుగూడా కాదు. యెవరో కట్టించిన పాతసత్రం. కిందంతా అస్థినిమజ్జనాల కోసరంవచ్చే జనాలబస. ప్రతిరూంలోనూ, ప్రతిమనిషి చేతుల్లోనూ అస్థికల మూట. పైన మాత్రం కొట్టికోలాహలం. హైస్కూల్లో మన టీచరు 'సమాధుల మధ్యలో జయకేతనాలు' అని చెప్తావుండేవాడు. ఆ మాట జ్ఞాపకమొస్తావుంది నాకు..."

యిద్దరూ యిటుకరాళ్లు పరిచిన సన్నటిరోడ్డుపైన నడుస్తూ ముందుకు వస్తున్నారు. రెండువైపులా పొగచూరి, కూలిపోవడనికి సిద్దంగా వున్న యిండ్లు.

వంటిల్లూ, బాత్రూం, పడకగదీ అన్నీ అదే అయిన చిన్న చిన్న కాపురాలు. సైడుకాలువలే పిల్లలకూ పెద్దలకూ కక్కసుల్లైపోయినట్టు తెలిసిపోతోంది. వీధిలోనే పెద్దప్లాస్టిక్ బక్కెట్టు పెట్టుకుని నడివయస్సు స్త్రీ యేకంగా స్నానం చేస్తోంది. యెటుచూసినా మురికి, దారిద్ర్యం.

ఆగిన విక్రమ్‌లో కూర్చోగానే "హర్ ఆద్మీకో సత్తర్ రూపాయబాడా! రాత్ మే యహా ఆనేకా బీస్ రూపయా! అబ్ సంగమ్‌కో ఆనేజానేకేలియే పచాస్ రూపయా!" అన్నాడు డ్రైవరు. "పాపం, యిచ్చేవానిదా, తీసుకునేవానిదా అనేదేగదా ప్రశ్న!?" అంటూ నవ్వేశాడు జానీ. సీట్లన్నీ నిండాక విక్రమ్ వెనక్కు తిరిగి పరుగులు తీయసాగింది. సన్నటి గతుకుల రోడ్డుదాటి, కాస్త పెద్దదైన తారు రోడ్డుమీదికొచ్చి, రకరకాల సెంటర్లను అధిగమించి, మళ్లీ సన్నటి రోడ్లను ఆశ్రయించి, దాదాపు అరగంటసేపటి తర్వాత, వాలుగా వున్న రోడ్డుపైన పరిగెడుతూ చివరికి గంగాయమునల సంగమస్థలాన్ని యాత్రికుల దృక్కోణంలో నిలిపింది విక్రమ్.

* * *

...వచ్చి, అటువైపు నుంచీ తెల్లటి ప్రవాహమూ, యిటువైపు నుంచీ నల్లటి ప్రవాహమూ, రెండూ కలిశాక లేత నలుపు రంగు ప్రవాహమై, కనిపించని మరో ప్రవాహాన్ని తనలో కలుపుకుంటోందన్న విషయం భ్రమో, నిజమో, యితరులకు తెలియనివ్వకుండా జాగ్రత్తపడుతూ, వొడ్లను వొరుస్తూ, గట్లను తడుపుతూ, క్షణక్షణానికీ మారుతూ, మార్పన్నదే లేనట్టుగా గలగలా రవళిస్తూ, భూమ్యాకాశాల్ని కలుపుతున్నట్టుగా దిగంతరేఖదాకా సాగుతూ, దిగంతరేఖను మరికాస్త ముందుకు నెట్టుకుంటూ కదలుతూ, అనాదిగా, అజరామరంగా, తానే గంగై, తానే యమునై, తానే సరస్వతి గూడానై, తానే సంగమంగా మారి, తన అస్తిత్వానికి తానే పెక్కుభంగుల్ని కల్పించుకుంటూ, వెళ్తూ...

* * *

విక్రమ్ ఆగిన చోటునుంచీ సంగమానికి దారి చూపెడుతున్నట్టుగా బిక్షగాళ్లవరస కనబడుతోంది. అక్కడక్కడా డేరాలకింద బొరుగులు, దేవుళ్లపటాలు, కాశీదారాలు అమ్మే అంగళ్లుకూడా కనిపిస్తున్నాయి. గట్టునుంచీ నీళ్ళు ప్రవహిస్తున్న చోటువరకూ, కిలోమీటరు దూరం యిసుక మేటవేసివుంది. దూరంగా, నీటిప్రవాహం దగ్గర రకరకాల పందిళ్లూ, జన సంచారమూ కనబడుతోంది. అవతలిగట్టుపైన గుబురుగా పెరిగిన వృక్షాల మధ్యలోంచీ తెల్లటి గుడిశిఖరాలు కనిపిస్తున్నాయి.

విక్రమ్ క్లీనరుకుర్రాడు గట్టు దగ్గరినుంచీ యాత్రికుల్ని తూర్పువైపుకు నడిపించసాగాడు. చిత్తడినేలపైన చెప్పులముద్రలు స్పష్టంగా పడుతుండగా అందరూ ముందుకు కదిలారు. అస్థిపంజరాలకు పలచటి చర్మం తొడిగినట్టున్న ఆవుదూడల్ని తోలుకుంటూ యెదురొచ్చాడో వ్యక్తి. అతడి శరీరంలో గూడా యెముకలు బయటికి పొడుచుకొస్తున్నాయి. జంబుమొక్కల్లా పెరిగిన గడ్డపు వెంట్రుకలు అటూ యిటూ వొరుగుతుండగా, "గోదాన్ కీజియే బాబూజీ!" అంటూ వెంటపడ్డాడతను.

క్లీనరు కుర్రాడు "లక్ష్మీనారాయణశాస్త్రిజీకీ ఆద్మీ!" అన్నాడు జవాబుగా.

"కోయిబాత్ నహీ! దాన్ కర్‌నేమే క్యాబురా హై! దాన్ కీజీయే! ఆప్‌కే పురకోంకో పుణ్య్ మిలేగా!" అన్నాడతను. సంజీవి అతడివైపునకు అనుమానంగా చూశాడు. అతడి చూపులతో చూపు కలుపుతూ "సిర్ఫ్ హజార్ రూపాకో ఖరీద్‌లో! దాన్ ముజేహీ దీజియే! ఆప్‌కోతో పుణ్యమిలేగా!" అంటూ వివరించాడతను.

"మీ శాస్త్రివ్యాపారం కంటే లాభసాటిపని యిది. ఆవు ఆ మనిషిదే! మనకు అమ్ముతాడు. మళ్ళీ ఆయనే దానందీసుకుంటాడు. సాయంత్రానికి యెంత మందికి వీలయితే అంతమందికి అమ్మచ్చు. దానమూ తీసుకోవచ్చు" వెక్కిరిస్తున్నట్టుగా నవ్వుతూ అన్నాడు జానీ.

"నైతో పాంచ్ సౌ దేఖర్ ఖరీద్‌లో!" ఆవు యజమాని బేరంలోకి దిగాడు.

సంజీవి మౌనంగా ముందుకు నడవసాగాడు.

ఆవూదూడా వెంటరాగా ఆగంతకుడుకూడా వెనకే కదిలాడు.

"తీన్ సౌ..."

సంజీవి అతడివైపుకు తిరిగయినా చూడలేదు.

"దోసౌ... యేక్ సౌ... పచ్చీస్..."

"........."

"ఆప్‌కే పురకే జరూర్ నరక్ మే జాయేంగా! వైతరిణీ పారకర్‌నే సమయ్ హర్ హర్ కిసీకో గాయ్‌కీ పూంచ్ పకడ్‌కర్ తైర్‌నా పడేగా! ఆప్‌నే పురాన్ నహీపడా? గంగామాయీకే పాస్ ఆకర్ గోదాన్ నహీకరేంగేతో వుస్సే బడా దూసరాపాప్ నహీహై..."

నడకదారి నీళ్లదగ్గరికి చేరేవరకూ బేరం చేస్తూనే వున్నాడతను. విక్రమ్ క్లీనరు అక్కడ ఆగిన పడవవాళ్లతో బేటీ వేస్తున్నాడు. కాస్సేపటి తర్వాత "సంగమ్ కో ఆనే జానేకో హర్ ఆద్మీకో తీస్ రూపా పడేగా! నావ్ వాలేకో పహ్‌లేహీ పైసా దేనాహోగా!" అంటూ ప్రకటించాడు.

తమటికెట్టు డబ్బుల్ని పడవవాడికి సమర్పించుకున్నాక జానీతో బాటూ సంజీవిగూడా పడవెక్కాడు. గోదానాల స్వీకర్త పశువుల్ని వెనక్కు మరల్చుకుని, యాత్రీకుల్ని తిట్టుకుంటూ, మరో గుంపుదగ్గరికి వెళ్లిపోయాడు.

వొడ్డుకు కట్టిన మోకును విప్పేశాక, పడవ ముందుకు కదిలింది. దూరంగా రెండునదులూ కలుస్తున్న చోట ప్రవాహం వుధృతంగా సాగుతోంది. అక్కడక్కడా పడవలు కనబడుతున్నాయి. రకరకాల సంచీలను పదిలంగా పట్టుకుని కూచున్న యాత్రికులు నదినీళ్లకేసి విభ్రమంతో చూడసాగారు. నిశ్శబ్దం బరువుతో పడవ సైతం నీళ్లలోకి యెక్కువగా మునిగినట్టు కనబడుతోంది. తీరం వెంబడే అరగంటసేపు నత్తనడకగా ప్రయాణంచేశాక పడవ సంగమస్థలాన్ని చేరింది.

పడవవాడు పందిళ్ళకేసి చేయిచాపుతూ "వహీజావ్!" అంటూ ఆజ్ఞాపించాడు. యాత్రికులందరూ పడవదిగారు.

సంజీవి వోసారి వెనుదిరిగి చూశాక "యిక్కడికి యిసుకపైన్నుంచీ నేరుగా నడిచే రావచ్చుగదా! సంగమమంటే నదిని దాటాలని అనుకున్నాం మనం. యీ పడవవాడు అనావస్యంగా మనల్ని పడవెక్కించినాడు" అన్నాడు జానీ కిసుక్కుమని నవ్వుతూ.

సంగమంతీరం వెంబడీ వెదురుకర్రలతో రకరకాల పందిళ్లు వేశారు. పైన కొబ్బరికీతులూ, తార్పాల్ పట్టలూ పరిచారు, పందిళ్లకింద అక్కడక్కడా చెక్కబెంచీలు వున్నాయి. కొన్ని చెంచీలపైన యేవేవో దేవుళ్ల ఫోటోలూ, రకరకాల పూజ సామగ్రీ వున్నాయి. కొన్ని పందిళ్ళు జనాలతో కిటకిటలాడుతున్నాయి. మరికొన్ని పందిళ్లు ఖాళీగా బోసిపోతున్నాయి. తీరందగ్గర స్నానాలు చేసేవాళ్ళ సంరంభం మిన్ను ముట్టుతోంది.

వో పందిరికింద వెదురుబుట్టలో యేదో సర్దుకుంటూ గొడుగు పహిల్వాను కనిపించాడు సంజీవికి. ఆ పందిరి కింద కూర్చున్న యాత్రికుల దగ్గరికెళ్లి "లక్ష్మీనారాయణశాస్త్రిగారు యింకా రాలేదా?" అని ప్రశ్నించాడు సంజీవి.

"ఆయన యిక్కడికి రారట! మనల్ని యిక్కడికి రవాణా చేయటం వరకే ఆయనగారి పని. యిక్కడి తతంగమంతా యింకో పురోహితుడు చేస్తాడు. మేమంతా ఆయన కోసమే యెదురు చూస్తున్నాం" అన్నాడా వ్యక్తి.

"ఆరేడు నెలలుగా యీ వూళ్లోనే వుండావు. యీ మాత్రం సమాచారమైనా తెలుసుకోకుండా యేం చేస్తావుండావు?" అని విసుక్కుంటూ వో బెంచీపైన కూర్చున్నాడు సంజీవి.

"యీ వూర్లో యీ మాదిరి లోకమొకటుందని యిప్పటిదాకా నాకు తెలియనే

తెలియదు" అంటూ నవ్వేశాడు జానీ. "మా ఆఫీస్ ఆనందభవన్‌కు కిలోమీటరు దూరంలో వుంది. అక్కడికి దగ్గిర్నే క్వార్టర్స్. రోజుకు పన్నెండుగంటలు పనిచేసినా టయిం సరిపోవడం లేదు. కొత్తగా రిక్రూటయ్యే జవాన్లందరికీ సైకలాజికల్ టెస్ట్‌లు చెయ్యాల. వాళ్లకు హిందీ తప్ప యింకో భాషరాదు. నా కొచ్చే హిందీ అంతంత మాత్రమే! సైకాలజీ పుస్తకాలూ, డిక్షనరీ పక్కపక్కన బెట్టుకోని కాలం తోస్తావుండాను. డిఫెన్సు సర్వీసులో వుద్యోగమంటే మనవూర్లో అందరూ నాపక్క అసోధ్యంగా చూసినారు. కాని యింతదూరంలో, వొంటిబసివిగా బదికేది సులువేమీగాదు. మా అమ్మ మాటిని పెండ్లిజేసుకున్నా బాగుండు. నోటికి హితవుగా తిండయినా దొరికితింది..." కాస్సేపాగాక మళ్లీ అన్నాడు. "మీ శాస్త్రయినా, నేనయినా, యింతదూరం వచ్చింది కడుపాత్రానికే గదా!"

"అన్నిట్నీ దుడ్డుతోనే కొలవలేం! నీ పనికీ ఆయన పనికీ తేడానే లేదా?" అంటూ కసురుకున్నాడు సంజీవి.

"తేడా యెందుకు లేదు? నాదేమో చిన్న వుద్యోగం. ఆయనది టాక్సుగూడా కట్టాల్సిన పనిలేని లాభసాటి వ్యాపారం!" అంటూ నవ్వేశాడు జానీ. "దేవుడికంటే సులభంగా దొరికే వస్తువేముంది యీ దేశంలో! యీ అలహాబాదులో కూడా వీధివీధికీ వొక మసీదుందంట! నేనెప్పుడూ ఆపక్కకే పోలేదు..."

చేవబారిన రోజ్‌వుడ్ కొయ్యతో తయారు చేసిన శిల్పంలా నిగనిగ లాడుతున్న నడివయసు పురోహితుడొకడు పందిరిలోకి వచ్చీరాగానే "అస్థివాలాలంతా యిలా కూర్చోండి" అంటూ ప్రకటించాడు.

"యిక్కడ అస్థివాలాలు కానివాళ్లెవరు? అందరి శరీరాల్లోనూ వున్నవి యెముకలేగదా!" అన్నాడు జానీ ముఖం చిట్లించుకుంటూ.

"అస్థివాలా అంటే అస్థికలు నిమజ్జనంచేసే వ్యక్తిఅని అర్థం" అన్నాడు పక్కనే కూర్చున్న వ్యక్తి.

"అందరూ చొక్కాలూ విప్పేసి, ధోవతులు కట్టుకోవాలి!" అంటూ రెండో సూచనను ప్రసారం చేశాడు పురోహితుడు.

విప్పిన బట్టల్ని జానీ కప్పగించి, అస్థికలపాత్రను జిప్‌బాగ్ లోంచి బయటికి తీసుకుని, మిగిలిన అస్థివాలాలతో బాటూ పురోహితుడి ముందుకూర్చున్నాడు సంజీవి.

గొడుగు పహిల్వాన్ అస్థివాలాల ముందు మర్రి ఆకులవిస్తరాకుల్ని పరిచి,

వాటిపైన క్రతువుకవసరమైన వస్తువులన్నీ అమర్చసాగాడు. విస్తరాకులపైన అస్థికల పాత్రలనుంచుకుని వాళ్లందరూ పురోహితుడి సూచనలను పాటించసాగారు.

తెలుపూనలుపూ కలగలిసిన పురోహితుడి బవిరి గడ్డమూ పిలకజుట్టూ యీదురుగాలికి రెపరెపలాడుతున్నాయి. నిత్యగుట్కా సేవనంతో నల్లగా గారగట్టిన అతడి పలువరుస అవ్యక్తమైన అతడి జీవనయాతనకు ప్రతీకలా వెలవెలబోతోంది. శరీరంలోని మిగిలిన యితర భాగాలకంటే యెక్కువగా పనిచేయడం వల్ల అతడి నోరూ, పెదవులూ, బలంగా, దృఢంగా కనిపిస్తున్నాయి.

ముందుగా పురోహితుడు తనముందు కూర్చున్న దాదాపు యాభైమంది అస్థివాలాలపేర్లూ, నిమజ్జనం చేయబడుతున్న అస్థికల తాలూకు వ్యక్తులపేర్లూ, వాళ్ల సంబంధాలూ, గోత్రాలూ తెలుసుకున్నాడు. రకరకాల మంత్రాలు వల్లిస్తూ ప్రతివ్యక్తి దగ్గరా ఆగి వాళ్ళ వివరాలన్నిటినీ అలవోకగా వల్లించేశాడు. అతడి జ్ఞాపకశక్తికి వాళ్ళు విస్తుపోయి చూస్తుండగా "రోజుకు వందలమందిచేత శ్రాద్ధకర్మలు చేయిస్తాను. యింతవరకూ యెవరి పేర్లుగానీ, గోత్రాలు గానీ తప్పుగా రిపీట్ చెయ్యలేదు. అసలైన అవధానమంటే యిదే!" అంటూ పరవశంగా నవ్వేశాడు.

అతడిస్వరం మెగాఫోన్లకంటే బిగ్గరగా పలుకుతోంది. దూరంగా మిగిలిన పందిళ్ళనుంచీ వినిపిస్తున్న మంత్రధ్వనులూ, నదిలో మునుగుతున్న మనుషులకేకలూ, నదినీటిహోరూ అతడికి నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నాయి. భార్యల్ని పోగొట్టుకున్న యువకులూ, తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న ముసలివాళ్లూ, కన్నబిడ్డల్ని పోగొట్టుకున్న నడివయసువాళ్లూ, తోడబుట్టినవాళ్లని పోగొట్టుకున్న వ్యక్తులూ... యెటు చూసినా రకరకాల వ్యధలు. తన తల్లి స్మృతులు బలంగా కమ్ముకోవడంతో విచలితుడైపోయిన సంజీవి గుడ్ల నీళ్లుకుక్కుకుంటూ కూర్చున్నాడు.

పురోహితుడు వాళ్లందరిచేతా గోధుమపిండితో పిండాలు తయారుచేయించి, వాటికి రకరకాల నైవేద్యాలు సమర్పింపజేశాడు. చిన్న అరటిపండు తోలువొలిపించి "మీ వాళ్లకు మీరు యిస్తున్న చివరి ఆహారమిదే! తృప్తిగా సమర్పించండి" అంటూ హెచ్చరించాడు. చివరిగా అస్థికల్నీ, పిండాల్నీ నీళ్లల్లో వదిలిపెట్టి, స్నానంచేసి రమ్మన్నాడు.

అస్థికల కుండ చేతబట్టుకుని, బుగ్గలపైన కన్నీరు చారలు గట్టుతుండగా,

నదిదగ్గరికి నడవసాగాడు సంజీవి. జానీ అతడిదగ్గరికొచ్చి నడుస్తూ "మనకూ యీ అస్థికలకూ పెద్దతేడా లేదు. అవి నేరుగా నీళ్లల్లో కలిసిపోతాయి. నీళ్లకూ, మన యెముకలకూ మధ్య చర్మం అడ్డంగావుంది. లేకపోతే మనశరీరాలు గూడా నిమజ్జనమయిపోయినట్టే లెక్క!" అన్నాడు నిర్వికారంగా ముఖం పెట్టుకుంటూ.

సంజీవి ముభావంగా నీళ్లలోకి దిగాడు.

గట్టు దగ్గర పదిపన్నెండేళ్ల కుర్రాళ్ల రొదయెక్కువగా వుంది. రెండుమూడు బారలకవతల నీళ్లల్లో ఆగిన పడవలపై నుంచీ కొందరు పిల్లలు నీళ్లలోకి యెగిరెగిరి దూకుతున్నారు. నిమజ్జనం చేసిన రకరకాల వస్తువులు ప్రవాహంపైన నదికి అంచులా తెట్టు గట్టుకుపోయి వున్నాయి.

సంజీవి మరో అడుగు ముందుకేశాడు.

పది పన్నెండుమంది కుర్రాళ్ళు అతడివైపుకు వొక్కుమ్మడిగా యీదుకొచ్చారు.

సంజీవి మరికాస్త ముందుకు కదిలాడు. ప్రవాహం వేగంగా అతడి నడుముదాకా తడుపుతోంది. చివరిసారిగా తల్లి ఆత్మీయస్పర్శను అనుభవిస్తున్నట్టుగా అస్థికల పాత్రను గుండెలకత్తుకున్నాడు. కుర్రాళ్లు అతడి చుట్టూ కోటలా వొకరి చేతులు యింకొకరు కూర్చుకుని నిల్చున్నారు.

"త్వరగా కానీ! నీతో వచ్చిన వాళ్లంతా యెనక్కు మళ్లేసారు..." అంటూ అరిచాడు జానీ.

పెద్దగా నిట్టూరుస్తూ అస్థికల కుండను నీటిలోకి ముంచాడు సంజీవి. నీటిలోపల అతడి చేతుల్లోంచీ యెవరో కుండను లాక్కున్నారు. దిగ్గున వులిక్కిపడ్డాడు సంజీవి.

నీటిలోపల చేపపిల్లలా వో ఆకారం ముందుకు కదిలిపోయింది. నాలుగైదు బారలు వెళ్లాక ఆ ఆకారం నీళ్లపైకి లేచింది. పదిపన్నెండేళ్ల కుర్రాడొకడు అస్థికల పాత్రలో చేయిపెట్టి దేనికోసమో వెదుకుతున్నాడు. నలుగురైదుగురు పిల్లలు తమ చేతుల్ని గూడా కుండలోకి బలవంతంగా జొనుపుతున్నారు. పెళ్లుమంటూ కుండపగిలిపోయింది. అందులోని యెముకలూ, బూడిద నీళ్లలో పడిపోయాయి.

గట్టుపైన్నుంచీ జానీ మరి రెండుసార్లు కేకేశాకగానీ సంజీవి నీళ్లలోపలికి తలముంచలేదు. తల నీటిలోపలికెళ్లగానే అసంఖ్యాకమైన మానవ శరీరాలు వొక్కసారిగా తనను స్పృశించినట్టు తోచడంతో సంజీవి నిలువునా వణికిపోయాడు. పూనకం పట్టినవాడిలా వూగిపోతూ వొడ్డుపైకి విసురుకొచ్చాడు.

"అస్థికలతోబాటూ కొందరు బంగారమూ, చిల్లరనాణాలూ నిమజ్జనం చేస్తారంట! దానికోసరమే వాళ్ల దేవులాట! అది వాళ్ల బతుకు తెరువు!" అన్నాడు జానీ అడగని ప్రశ్నకు సమాధానం చెబుతున్నట్టుగా.

మొద్దుబారిన బుర్రతో, స్థబ్దమైన శరీరాన్ని పందిరిదాకా లాక్కొచ్చాడు సంజీవి. "గుండుగీయించుకోండి! లేకపోతే తలపైన మూడుగాట్లయినా పెట్టించుకోండి. అది శాస్త్రం" అంటూ యెదురొచ్చాడు పురోహితుడు. అతడి వెనకే కత్తి చేతబట్టుకుని మంగలివాడూ వస్తున్నాడు.

సంజీవి నిమిత్తమాత్రుడిగా మంగలివాడిముందు కూర్చున్నాడు. అతను సంజీవి తలపైన మూడుచోట్ల కత్తితో బరికి, గుప్పెడు వెంట్రుకల్ని తీసి పారేశాడు. ఆ తరువాత "పచ్చీస్ దేవ్!" అన్నాడు ముక్తసరిగా.

"పచ్చీస్ నై... దస్ లేవ్!" అంటూ దబాయించాడు జానీ.

"యిదర్ రేట్ పచ్చీస్, ఫిక్సెడ్..." అన్నాడు మంగలి.

జానీ సంజీవి చొక్కాలోంచీ డబ్బుతీసి, లెక్కబెట్టి, మంగలికిచ్చేశాడు.

"మళ్లీ స్నానం చేయాలి" అన్నాడు పురోహితుడు.

సంజీవికీసారి గంగను చూస్తే భయమేసింది.

తక్కుతూ తారుతూ నీళ్లలోకి దిగి, కళ్లుమూసుకుని, ఆదుర్దాగా మూడుమునకలు మునిగేశాడు. అతనీసారి పందిరి దగ్గరికి తిరిగొచ్చేసరికి పురోహితుడి కంఠస్వరంలో మార్పు స్పష్టంగా ధ్వనిస్తోంది. "మీ పెద్దలకు శ్రాద్ధకర్మలు సక్రమంగా జరిగినందుకు బ్రాహ్మణులకు సంతర్పణ చేయండి. మీ శక్తికెంత వీలయితే అంత చెయ్యొచ్చు. బలవంతం లేదు. అయితే మీరు పెట్టిన ఖర్చంతా మీ పెద్దలను పుణ్యలోకాలకు చేరుస్తుందని మరిచిపోవద్దు... యీ వూళ్లో నాసిరకం భోజనం చేయాలన్నా మనిషికి పాతికరూపాయలు ఖర్చవుతుంది. పదహారుమందికో, పన్నెండుమందికో, తొమ్మిది మందికో, ముగ్గురికో, కనీస సంతర్పణ చేయండి. యెంతమందికి సంతర్పణ చేయించదలచుకున్నారో అన్ని పాతికలు నా చేతికివ్వండి. మీ చేత యీ కర్మ చేయించటంకోసం మనదేశాన్నొదిలి, పొట్టచేతబట్టుకుని, యింత దూరం వచ్చాను. శాస్త్రిగారికిచ్చిన దక్షిణతో నాకేం సంబంధం లేదు. నాకివ్వదలచుకున్నదేదో తాంబూలంలో పెట్టి యివ్వండి. నా పాదాలకు నమస్కారం చేసుకోండి. ఆశీర్వదిస్తాను."

దూరంగా వొడ్డుదగ్గర కలకలం ప్రారంభమైంది. పిల్లలందరూ ప్రవాహంనుంచీ దూరంగా పరుగులు తీస్తున్నారు. "వూపర్ సే ప్రవాహ్

ఆతీహై!" అంటూ వో కీచుగొంతుక పెద్దగా అరుస్తోంది.

"యిది వర్షాకాలం గదా! రోజూ యిదో గొడవ. పైన్నుంచీ వెల్లువ ముంచుకొస్తోందని రోజూ భయపడ్డమే! కృష్ణానదితో ఆడుకుంటూ పెరిగిన శరీరంనాది. వరదలెప్పుడు ముంచుకొస్తాయో నాకు తెలియందిగాదు. మీరు కంగారు పడకుండా దక్షిణ సమర్పించండి" అంటున్నాడు పురోహితుడు. పురోహితుడికి దక్షిణ యిచ్చుకున్నాక, జానీ దగ్గరినుంచీ తన దుస్తుల్ని తీసి తొడుక్కున్నాడు సంజీవి.

మరోసారి ప్రవాహం దగ్గర గగ్గోలు చెలరేగింది. పైకొచ్చిపడిన నీటివురవడికి తట్టుకోలేక పెద్దపందిరొకటి పటాపటా విరిగి ప్రవాహంలో పడికొట్టుకుపోసాగింది. పెద్దగా అరుస్తూ జనం పరుగులు మొదలుపెట్టారు. యింతలో మరో పందిరి కూలింది. కార్చిచ్చు వ్యాపించినంత వేగంగా ప్రవాహం ముంచుకొస్తోంది. పురోహితుడు సైతం పంచ పైకెగగట్టుకుని పరుగులు తీస్తున్నాడు.

"పద... పద... పరిగెట్టు" అంటూ దౌడు తీశాడు సంజీవి. అప్పటికే జానీ పరుగందుకునేశాడు. తమ పరివారాన్నీ, వస్తువులనూ సర్వస్వమూ మరచిపోయి జనమంతా గుండెలరచేత పట్టుకుని గట్టుకేసి పరిగెడుతున్నారు. వెనకనుంచీ ప్రవాహం చావులా తరుముకొస్తోంది. చూస్తూండగానే సంజీవి కాళ్లకిందికి నీళ్లుముంచుకొచ్చేశాయి. పాదాలు తడిసిపోయాయి. మరికొన్ని క్షణాల్లోనే అతడిమోకాళ్లకూడా నీటిలో మునిగిపోయాయి.

"బాబూజీ యిదరాయియే!" అన్నకేక వినిపించింది. కొయ్యపడవ పైన్నుంచీ నావ్వాలా కేకేస్తున్నాడు. చప్పున అటు తిరిగి పడవలోకెగిరి దూకేశాడు సంజీవి. ఆవెనకే జానీగూడా పడవలోకి గెంతడం కనిపించిందతనికి.

నీటి వాలుపైన పడవ వేగంగా కదులుతోంది. దూరంగా తీరం కనబడుతోంది. కొంతమంది మనుషులు యింకా తీరం దగ్గర పరిగెడుతున్నారు. యింకొందరు పడవల్లోకి చేరుకున్నారు. రెండు నదులూ కలిసినచోట పాతగుడివొకటి నీటిలో మునిగిపోతోంది. రెండునదుల్లోనూ వర్షంనీళ్లు పొంగుకొస్తున్నాయి. యిప్పుడు యేది గంగో, యేది యమునో తెలియడంలేదు. సంగమం తీరంకేసి వెనక్కు పరుగెడుతున్నట్టుగా కనిపిస్తోంది. జనాలగోడు నదిహోరులో వినిపించడం లేదు.

కాస్సేపు పడవలో స్థబ్ధంగా కూలబడిపోయాడు సంజీవి. పడవచివర్లో శిల్పంలా నిలబడిపోయిన జానీ కళ్ళార్పకుండా నదీ ప్రవాహంకేసి చూస్తున్నాడు.

వరద వుధృతిలో పడవ గింగిరాలు తిరుగుతూ కొట్టుకుపోతోంది. నీళ్లు

పడవ అంచుల దాకా యెగసిపడుతున్నాయి. పడవవాడు శక్తికొద్దీ తెడ్డేస్తూ పడవను అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

"జోర్‌సే తెడ్డుదాలో! యిదరీచ్‌దాలో! తుమ్ వుదర్ కిస్‌కో దాల్‌తాహై!" అంటూ వచ్చీరాని హిందీలో పడవవాణ్ణి కసురుకున్నాడు సంజీవి.

"ప్రవాహ్‌కే కిలాఫ్ డాండ్ చల్‌నేసే నావ్ వులట్ జాయేగా!" అని అరిచాడు పడవవాడు.

చూస్తూ వుండగానే పడవ సంగమంనుంచీ దూరంగా కొట్టుకొచ్చేసింది. సంజీవికి యేడుపు ముంచుకొచ్చేసింది. వెక్కిళ్లు తన్నుకొచ్చాయి. కాలం నడవటం మానేసినట్టుగా అనిపించడంతో అలా తామెంత సేపు నీటివాటంలో కొట్టుకు పోయారో గమనించే స్థితిలో లేడు సంజీవి.

భీకరమైన మృగపుకోరల్లా నీళ్లుపడవలోకి దూసుకొస్తున్నాయి. యిదే తనకు ఆఖరు గడియేమోననీ, తానిక సురక్షితంగా యింటికి తిరిగివెళ్లే అవకాశం లేదేమోననీ సంజీవి కనిపించసాగింది. గబగబా జేబులోకి చేయిపెట్టి దొరికిన డబ్బునంతా తీసి పడవవాడికందిస్తూ "నీకెంత కావాలంటే అంతా తీసుకో! మమ్మల్నెలాగైనా తీరం చేర్చు" అంటూ బొంగురుపోతున్న గొంతుకతో ప్రాధేయపడ్డాడు.

చెమటలు కారుస్తున్న ముఖాన్ని పైకెత్తి సంజీవికేసి చూస్తూ అదోలా నవ్వాడు పడవవాడు. అతడి పెదవులు చిత్రంగా కదిలాయి. అంతలో మళ్లీ ఆ ప్రయత్నం విరమించుకుని వో చేత్తో తెడ్డేస్తూనే, మరో చెత్తో డబ్బందుకుని తన జేబులోకి నెట్టేశాడు.

యిలోగా రివ్వున వో నీటితేప పడవను విసిరికొట్టింది. దారంతెగిన గాలిపటంలా వూగిసలాడుతూ, పడవ పక్కకు తిరిగి తీరంకేసి దూసుకెళ్లింది. వేగంగా గట్టును ఢీకొట్టబోతోంది. "కూదో సాబ్" అన్న కేకతోబాటూ పడవవాడు గట్టుపైకి దూకేశాడు. యెవరో వెనకనెట్టుతున్నట్టు సంజీవి సైతం యెగిరి గట్టుపైకి దూకాడు. ఆ తరువాత స్ప్రింగులా పైకిలేచి నదినుంచీ దూరంగా పరిగెత్తసాగాడు. దాదాపు పదినిమిషాల తర్వాత, కనిపించిన పెద్ద రాతిపైకెక్కి నిల్చుని, రొప్పుతూ వెనక్కు తిరిగిచూశాడు. దూరంగా పరిగెత్తుకొస్తున్న జానీ కనిపించాడు. పడవవాడు మాత్రం తాపీగా నడచి వస్తున్నాడు.

గసతో యెదరొమ్ము యెగసిపడుతుండగా గుండుపైన అలాగే కూర్చున్నాడు సంజీవి. ముఖంపైన ధారలుగట్టిన చెమట వుప్పగా పెదవుల్ని తాకుతోంది. యింతలో జానీ కూడా వచ్చి అతని పక్కనే కూర్చున్నాడు. అలసటతో అతడు

గూడా బుసలు గొడుతున్నాడు. హోరుమంటూ యీదురుగాలి వీస్తోంది. చెట్లూ, పొదలూ శివాలెత్తినట్టుగా వూగుతున్నాయి. మిత్రులిద్దరికీ వొకరి గుండెల సవ్వడి మరొకరికి వినబడుతోంది. పడవవాడు దూరంగా వున్న మరో రాతిపైకెక్కి కూర్చుని సేదతీరసాగాడు.

"అంతా భ్రమ... మూర్ఖత్వం" అంటూ గొణిగాడు సంజీవి. జానీ అతడికేసి ముఖమైనా తిప్పిచూడలేదు. "చిన్నప్పటినుంచీ నన్నెంత నీతిగా, నియమంగా పెంచింది మా అమ్మ! యెంత దీక్ష ఆమెది! యెంత భక్తితో, నిష్టతో ఆమె అస్థికల్ని నిమజ్జనం చేసినాను! ఆమె అస్థికల్ని తనలో కలుపున్నాక గంగకూడ అమ్మే అయిపోలేదా!" చెబుతూనే నిట్టూర్చాడు సంజీవి. "అంతా పిచ్చిలెక్క! వర్షం కురిస్తే గంగ పారుతుంది. గంగంటే నీళ్లు. చచ్చిపోయినాక అమ్మబతుకు ఆఖరయిపోయింది. అస్థికలంటే కేవలం కాల్షియం. అంతే! బతికినంత కాలమే బతుకు... ఆత్మ, పుణ్యం పైలోకాలు, మతం, అన్నీ ట్రాష్... అవన్నీ అబద్ధాలు గాకపోతే యింత నిష్టతో శ్రాద్ధకర్మలు జేసిన నా దగ్గిరికి చావింత దగ్గిరగా యెట్లొస్తుంది? యివన్నీ పనికిరాని మాయమాటలు. యీ బతుకులో అవేవీ వుపయోగానికి రావు. జానీ, వింటావుండావాలేదా?"

జానీ వులిక్కిపడి వింటున్నట్టుగా తలవూపాడు.

"అంతవరకూ ప్రవాహానికి అడ్డంగా తెడ్డేసిన మనిషిని దోవమర్లించిన శక్తిపేరేమి? దేన్నిచూసి వాడు మారినాడు? అసలు ముందుగా దేని కోసరం మనల్ని ప్రమాదంలోకి లాక్కొని పోయినాడు? మన బతుకుల్నంతా నడిపిస్తావుండే పవరు యేది?... చావు కొంగుదాకా పోయినప్పుడుగానీ నాకు నిజం తెలియలేదు. గంగలో మునిగినప్పుడు దేన్నయినా వదిలిపెట్టి పోవాలంటారు. నేను గంగలో వదులుకునింది యేందో యిప్పుడు అర్థమవుతావుంది నాకు..." అన్నాడు సంజీవి.

"నిజమే సంజీవీ! చావు అంచుదాక పోయినప్పుడుగానీ నాకు గూడా నిజం తెలిసిరాలేదు" అన్నాడు జానీ కాస్సేపాగి సాలోచనగా. "వరదనీళ్లలో, వొటి పడవలో కొట్టుకుని పోతావుండేటప్పుడుగానీ మనిషెంత బలహీనుడో తెలియలేదు నాకు. డబ్బుంటే లోకాన్నంతా గెలిసేయొచ్చుననుకున్నాను. నీళ్లమధ్య వొంటిగా చిక్కుకోనిపోయినప్పుడు భయంతో హడలెత్తిపోయినాను. నీళ్లజోరు చూడలేకుండా కండ్లు మూసుకున్నాను. యీలోపల నా బుర్రలో యేందో మాయ జరిగిపోయింది. చిన్నప్పుడెప్పుడో మసీదులో నేర్చుకున్న సూరాలు జ్ఞాపకం వచ్చినాయి. యెంతసేపట్ల సూరాలు జపిస్తా వుండిపోయినానో

తెలియదు. కండ్లు తెరిచి చూసినాను గదా! పడవవాడు తెడ్డువదిలిపెట్టేసి పక్కకు జరగతా కనబడినాడు. సరిగ్గా అప్పుడే పెద్ద అల పడవను యీడ్చి కొట్టింది. చెప్తే నువ్వు నమ్మతావో, నమ్మవో! కానీ ప్రమాణపూర్తిగా నేను చెప్పేది మాత్రం నిజం. ఆ అల యేమాదిరి యెగిరిందనుకున్నావు? మా యింట్లో గోడపైన నాగూరు దర్గా ఫోటో చూసినావు గదా నువ్వు! అచ్చం అదే ఆకారం. వెంటనే దర్గాకొచ్చి పాతాలు యిస్తానని మొక్కుకునేసినాను. ఆశ్చర్యం. పడవ గట్టుదగ్గిరికి యిసరకొచ్చేసింది...." జానీ చెప్పుకుపోతూనే వున్నాడు. సంజీవి అతడికేసి వింతగా చూస్తూనే వున్నాడు.

హిమాలయాల్లో కరిగిన మంచునీ, మేఘాల్లోంచీ కురిసిన వాననూ, వొకేలా తనలో కలుపుకుని, వేలాది సంవత్సరాలుగా కోట్లాది మంది జీవుల అస్థికల్ని తనలో నిమజ్జనం చేసుకుని, వొడ్డున జరుగుతున్న పరిణామాలకు తానేమీ కారణం కాదన్నట్టుగా రొదచేస్తూ, నిర్లక్ష్యంగా, నిష్పూచీగా, గంగానది ప్రవహిస్తూనే వుంది.

*(సెప్టెంబరు 2001, విపుల)*

❖❖❖